ఆంధ్రజ్యోతి
andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 41.5 ; కనిష్ఠం 26.3
నిజామాబాద్ జిల్లా వార్తలు
5
బుధవారం 16 ఏప్రిల్ 2025



● రసాయన పరిశీలన అధికారి కార్యాలయం



● కల్లు డిపోను పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్)



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

కేసీఆర్ ఉద్యమ ఫలితమే తెలంగాణ రాష్ట్రం

- ఇకపై బీఆర్ఎస్ కార్యకర్తలు చెప్పేదే పార్టీ చేస్తుంది..
- ఎంపీ అర్వింద్ ఇందూరు బిడ్డ అయితే.. పసుపు బోర్డుకు చట్టబద్ధత తీసుకు రావాలి
- మళ్లీ అధికారంలోకి రామని తెలిసే.. కాంగ్రెస్ నేతలు దోచుకు తింటున్నారు : ఎమ్మెల్సీ కవిత

డిచ్‌పల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ ఉద్యమ ఫలితమే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. 24ఏళ్ల బీఆర్ఎస్ ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొని 25 సంవత్సరం రజతోత్సవం అడుగిడుతున్న సందర్భంగా ఈ నెల 27న వరంగల్‌లోని ఎల్కతుర్తిలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కవిత పిలుపునిచ్చారు. మంగళవారం డిచ్‌పల్లిలో నిర్వహించిన సన్నాహక సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేసీఆర్ ఉద్యమ పార్టీగా జైత్రయాత్ర చేయడానికి ఎల్కతుర్తి సభను నిర్వహిస్తున్నారన్నారు. ఆ రోజుల్లో కేసీఆర్ పిలుపునిస్తే ఊరు వాడలు కదిలాయన్నారు. కేసీఆర్ బక్కమనిషి అయినా.. మొండి మనిషి అని కవిత కొనియాడారు. తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన సమయంలో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ కేసీఆర్‌ను ఎంతో ప్రశంసించారని, కేసీఆర్ ఎదుర్కొన్న అనేక సంక్లిష్ట పరిస్థితులను తాను కళ్లారా చూశానని కవిత పేర్కొన్నారు. ఇక నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు చెప్పేదే పార్టీ చేస్తుందన్నారు. తర్వాత వచ్చేది బీఆర్ఎస్ 3.0 అని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలకు చెరో 8 పార్లమెంట్ స్థానాల్లో ప్రజలు గెలిపిస్తే రాష్ట్రానికి కేంద్రం ఇచ్చింది మాత్రం గుండా సున్న విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో కూడా పసుపు బోర్డుకు నయాపైస ఇవ్వలేదన్నారు. ఎంపీ అర్వింద్ ఇందూరు బిడ్డ అయితే పసుపు బోర్డుకు చట్టబద్ధత తీసుకురావాలని కవిత డిమాండ్ చేశారు. అన్ని బోర్డులకు పార్లమెంట్ చట్టం చేస్తే పసుపు బోర్డుకు మాత్రం గెజిట్ మాత్రమే ఇచ్చి కేంద్రం చేతులు దులుపుకుందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో 20శాతం కమీషన్ దోచుకుంటున్నారని విమర్శించారు. ఇతర రాష్ట్రాలతో పాటు ఢిల్లీ వంటి ప్రాంతంలో కూడా ఇలాంటి ప్రచారం జరగడం.. ఫలితంగా తెలంగాణ ఖ్యాతి తగ్గడం తనకు బాధగా అనిపించిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మరో 30ఏళ్ల వరకు కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రాదని తెలిసే ఇష్టమొచ్చినట్టు దోచుకుతింటున్నారని కవిత విమర్శించారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి..

: మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

బీఆర్ఎస్ 27న రజతోత్సవ సభను విజయవంతం చేయాలని, దొంగ హామీలతో గద్దెనెక్కిన రేవంత్ సర్కార్‌కు దిమ్మ తిరిగేలా జనం కదలాలని బాజిరెడ్డి గోవర్ధన్ పిలుపునిచ్చారు.

బీజేపీ, కాంగ్రెస్ జోకర్ పార్టీలు..

: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి

జిల్లాలో కాంగ్రెస్, బీజేపీ జోకర్ పార్టీలుగా మారాయని, ఈ రెండు పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాల్సిన బాధ్యత ఉందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లాలో గెలిచిన ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్ రెడ్డిలు నల్లమట్టి, మొరం, ఇసుక మాఫియాలుగా మారారని విమర్శించారు. రూరల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఇటుక బట్టీలు, ధాన్యం బాన్సువాడలో గెలిచిన పోచారం అమ్మపాలు తాగి రొమ్ము గుద్ది గండి పిల్లిగా మారాడాని ఘాటు విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

గరళం
'కల్లు' తిరిగే దందా!

- జిల్లాలో యథేచ్ఛగా కల్తీ కల్లు విక్రయాలు
- ప్రమాదకర రసాయనాలతో పెద్ద ఎత్తున తయారీ
- వందల్లో శాంపిళ్లను సేకరిస్తున్న అధికారులు
- ఒకటి, రెండు కేసులతోనే సరిపెడుతున్న వైనం
- ఎక్సైజ్ శాఖ అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- కొద్దిపాటి సమస్యతో వృథాగా మారిన ఆల్ఫాజోలం గుర్తింపు యంత్రం
- జిల్లాలోని కల్లు శాంపిళ్లను హైదరాబాద్‌కు పంపిస్తున్న అధికారులు

> జిల్లాలో కల్తీకల్లు అమ్మకాలు యథేచ్ఛగా జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. రోజంతా కష్టపడి అలసటను తీర్చుకునేందుకు పేద, మధ్యతరగతి వారు తాగే కల్లు అలవాటు.. కొందరు అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఆల్ఫాజోలం, డైజోఫాం, క్లోరోహైడ్రేడ్ వంటి ప్రమాదకర పదార్థాలను కలుపుతూ.. శ్రమజీవుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కల్తీ కల్లు తయారీలో కనీస నిబంధనలు పాటించక పోవడంతో దానికి అలవాటు పడిన పేద ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు.



సుభాష్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కల్తీకల్లు ఏరులై పారుతోంది. కొన్నేళ్లుగా గుత్తేదారులు యథేచ్ఛగా కృత్రిమ కల్లును తయారు చేసి విక్రయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారుగా 491 కల్లు డిపోలు ఉన్నాయి. ఇందులో కొంతమేర చెట్ల ద్వారా కల్లును సేకరించి అమ్మకాలు సాగిస్తుండగా.. చాలామట్టుకు కృత్రిమంగా కల్లును తయారు చేసి విక్రయిస్తున్నారు. వీటిపై నిఘా ఉంచాల్సిన ఎక్సైజ్ అధికారులు అడపాదడపా దాడులు చేస్తూ మమ అనిపిస్తున్నారు. దీన్నే అదునుగా భావించిన కల్లు తయారీదారులు యథేచ్ఛగా రసాయనాలతో కృత్రిమ కల్లును తయారు చేస్తున్నారు. కృత్రిమ కల్లును గుర్తించడానికి మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలకు కలిపి నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రసాయన పరిశీలన అధికారి కార్యాలయం ఏర్పాటు చేశారు. మూడు జిల్లాలకు చెందిన శాంపిళ్లను జిల్లాకే తీసుకువచ్చి పరిశీలిస్తుంటారు. కృత్రిమ కల్లులో కలుపుతున్న ఆల్ఫాజోలం, డైజోఫాం, క్లోరోహైడ్రేడ్ వంటి రసాయనాలను గుర్తించడానికి ఈ పరిశీలన కేంద్రం ఉపయోగపడుతోంది. జిల్లాకు చెందిన ఎస్‌హెచ్‌వోలు శాంపిళ్లను సేకరించి పరిశీలన కేంద్రానికి పంపిస్తారు. శాంపిళ్ల సేకరణ జరుగుతున్నా వాటిలో కృత్రిమ కల్లు రసాయనాలను గుర్తించడంలోనే విఫలమవుతున్నారు. శాంపిళ్లు వందల్లో తీసుకున్నా.. కేవలం ఒకటి రెండు మాత్రమే కృత్రిమ కల్లుగా గుర్తించి చర్యలు తీసుకుంటున్నారు. వందల సంఖ్యలో శాంపిళ్లు సేకరించి కేవలం ఒకటి రెండు వాటిపైనే అధికారులు కేసులు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వందల సంఖ్యలో శాంపిళ్ల సేకరణ.. ఒకటి రెండు వాటిపై చర్యలు

ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కృత్రిమ కల్లును గుర్తించడానికి ఆకస్మిక తనిఖీలు చేపట్టి శాంపిళ్లను సేకరిస్తారు. 2023లో వందకు పైగా శాంపిళ్లను పంపించగా.. కేవలం ఒకటి మాత్రమే రసాయనాలు కలిపినట్లు గుర్తించారు. 2024లో సైతం ఒకటి రెండుతోనే సరిపెట్టారు. 2025 శాంపిళ్ల ఫలితాలు ఇంకా వచ్చాయోలేదో తెలియలేదు. లక్షల లీటర్ల కృత్రిమ కల్లు జిల్లాలో ఏరులై పారుతుంటే ఒకటి రెండు కేసులు కావడంపై ప్రజలు విస్మయానికి గురవుతున్నారు. వారం రోజుల క్రితం బాన్సువాడ డివిజన్ పరిధిలో కృత్రిమ కల్లు తాగి 60 మందికి పైగా ఆసుపత్రి పాలవ్వగా వాటి శాంపిళ్లను కూడా అధికారులు సేకరించారు. వీటి ఫలితం ఎలా ఉంటుందో వేచి చూడాలి. ల్యాబ్‌లో పక్కాగా పరీక్షలు జరిపి కల్తీకల్లు తయారీదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

లక్షలు వెచ్చించారు.. వృథాగా పడేశారు

కృత్రిమ కల్లును గుర్తించడానికి ఆల్ఫాజోలం కృత్రిమ కల్లులో కనిపెట్టడానికి జిల్లాలో ఆల్ఫాజోలం గుర్తింపు యంత్రాన్ని మూడు సంవత్సరాల క్రితం జిల్లాకు తీసుకువచ్చారు. సుమారు 40 నుంచి 50లక్షలు వెచ్చించి యంత్రాన్ని కొనుగోలు చేశారు. కొద్దిపాటి యాంత్రీకరణ సమస్యతో మూడు సంవత్సరాలుగా యంత్రం వృథాగానే పడి ఉంది. దీంతో ఆల్ఫాజోలం, శాంపిళ్లను హైదరాబాద్‌కు పంపిస్తున్నారు. కేవలం కొన్నింటిని మాత్రమే ఇక్కడ పరిశోధన చేసి ఫలితాలను ఇస్తున్నారు. ఆల్ఫాజోలం గుర్తించే యంత్రాన్ని మరమ్మతులు చేసుకొని ఉపయోగంలోకి తెస్తే హైదరాబాద్‌కు వెళ్లే పని తప్పుతుంది. ఫలితాలు కూడా పక్కాగా వస్తాయి. అధికారులు దీనిపై దృష్టిపెట్టి లక్షలు వెచ్చించి అయినా యంత్రాన్ని మరమ్మతులు చేయించి వృద్ధిలోకి తీసుకురావాలి. దీనికితోడు ఈ శాఖలో సిబ్బంది కొరత సైతం వేధిస్తున్నట్లు సమాచారం. మూడు ఉమ్మడి జిల్లాలు కలిపి ఒకేచోట పరిశీలన చేయడంతో దానికి తగ్గ సిబ్బంది లేకపోవడం సమస్యగా మారినట్లు తెలుస్తోంది.

కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నాం..

: మల్లారెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్



ఎప్పటికప్పుడు కల్లు డిపోల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం. శాంపిళ్లను సేకరిస్తున్నాం. ఇప్పటి వరకు జిల్లాలో 14 మందిపై కేసులు నమోదు చేశాం. 8 మంది లైసెన్సులను రద్దు చేశాం. ఒక టీసీఎస్ లైసెన్సు రద్దు చేశాం. కృత్రిమ కల్లు తయారు చేస్తున్నవారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం.

స్వదేశానికి పంపించండి!

● దుబాయిలో ఉన్మాది దాడిలో గాయపడిన జిల్లావాసి వేడుకోలు

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తనను వెంటనే తమ స్వగ్రామానికి పంపించాలని దుబాయిలో పాకిస్తాన్ జాతీయుడు జరిపిన దాడిలో గాయపడిన జిల్లా ఆర్మూర్‌కు చెందిన దేగాం సాగర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వేడుకుంటున్నాడు. ఇటీవల దుబాయిలోని ఓ బేకరీలో పాకిస్తాన్ జాతీయుడు కత్తితో ఒకరిని హతమార్చి.. పక్కనే ఉన్న సాగర్‌ను చంపేందుకు రాగా తృటిలో తప్పించుకున్నాడు. దీంతో అదే కోపంతో సదరు పాకిస్తానీయుడు సమీపంలోనే ఉన్న నిర్మల్ జిల్లా సోన్ గ్రామానికి చెందిన తన బావ అయినటువంటి ప్రేమ్‌సాగర్‌ను హత్య చేశాడు. దీంతో తీవ్ర భయాందోళనకు గురైన దేగాం సాగర్.. అక్కడి నుంచి పరుగులు పెడుతూ ప్రాణాలతో తప్పించుకున్నాడు. ఈ విషయం తెలిసిన సన్నిహితులు, కుటుంబ సభ్యులు సాగర్‌కు ఫోన్ చేసి యోగాక్షేమాలను కనుక్కున్నారు. దీంతో ఇక్కడ తనకు భయంగా ఉందని.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నానని సాగర్ కుటుంబీకులతో ఆవేదన వ్యక్తం చేశాడు. తన కళ్లెదుటే జరిగిన బావ ప్రేమ్‌సాగర్ హత్యను ఇప్పటికీ మరిచిపోలేక పోతున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. సెకన్ల వ్యవధిలో తాను ప్రాణాలతో బయట పడ్డానని చెప్పాడు. తనను వెంటనే స్వదేశానికి పంపించాలని దుబాయిలోని అధికారులతో పాటు మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను దేగాం సాగర్ వేడుకుంటున్నాడు. మరోవైపు.. సాగర్ త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సైతం తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తమ కొడుకును వెంటనే స్వదేశానికి రప్పించేందుకు అధికారులు, నాయకులు తల్లిదండ్రులు దేగాం రాజమణి, పెద్ద పోశెట్టితో భార్య, భవాన్ని ప్రభుత్వాలను కోరుతున్నారు.



ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో మాక్ డ్రిల్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా నగరంలో పలు ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. నగరంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతంలో అవగాహన సదస్సులు నిర్వహించి ప్రమాదాలు జరిగితే తమను తాము ఎలా కాపాడుకోవాలో మాక్ డ్రిల్ ద్వారా వివరించారు. నగరంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్‌తో పాటు బస్టాండ్ పక్కన ఉన్న షాపింగ్ మాల్‌లో అవగాహన నిర్వహించారు. మంటలను ఎలా ఆర్పాలి, అగ్నిమాపక యంత్రాలను ఎలా వాడుతారు అనే అంశంపై సిబ్బందికి క్లుప్తంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పసుపు ధర పైపైకి..

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో పసుపు ధర పెరిగింది. మంగళవారం మార్కెట్‌లో కాడరకం పసుపుకు క్వింటా రూ.15,388లు ధర పలికింది. కాడ రకం పసుపు మార్కెట్‌కు మొత్తం 6922 క్వింటాళ్లు రాగా గరిష్ఠ ధర 15వేల 388, కనిష్ఠ ధర 9,500, సగటు ధర 13వేల 800 పలికింది. గోల రకం పసుపు మార్కెట్‌కు 4783 క్వింటాళ్లు రాగా గరిష్ఠ ధర రూ.14వేల 579, కనిష్ఠ ధర రూ.8వేలు, సగటు ధర రూ.12వేల 500లు పలి కింది. చూర రకం 1439 క్వింటాళ్లు రాగా గరిష్ఠ ధర 14వేల 449, కనిష్ఠ ధర 8వేలు, సగటు ధర 12వేలు పలికింది. అట్టురకం పసుపు 68 క్వింటాళ్లు రాగా గరిష్ఠ ధర 9500, కనిష్ఠ ధర 7500, సగటు ధర 8506 రూపాయలు పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. ఈ మధ్యకాలంలో నిజామాబాద్ మార్కెట్‌లో 15వేలకు పైగా క్వింటాలుకు ధర దక్కడం ఇదే తొలిసారి కావడంతో పసుపు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేసిన కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అవమానించిన బీజేపీ నాయకులు ఇటీవల అంబేద్కర్ విగ్రహాన్ని తాకినందున జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని పూలాంగ్‌లోగల అంబేద్కర్ విగ్రహానికి పాలతో శుద్ధి చేశారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశవేణు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నుంచి మొదలుకొని గ్రామస్థాయి బీజేపీ కార్యకర్త వరకు అంబేద్కర్‌ను అవమానించారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి, సీనియర్ నాయకులు రత్నాకర్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సన్న బియ్యం సరే.. దొడ్డు బియ్యం సంగతేంటి?

- జిల్లాలోని రేషన్ దుకాణాల్లో పేరుకుపోయిన దొడ్డుబియ్యం నిల్వలు
- స్థలం లేక ఇబ్బందులు పడుతున్న రేషన్ దుకాణాదారులు
- అధికారుల నివేదికల్లో దొడ్డు బియ్యం నిల్వలు లేవు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ దొడ్డుబియ్యం నిల్వలు పేరుకుపోయాయి. ప్రభుత్వం ఈ నెల నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తుండగా.. గత నెలలో పంపిణీ చేయగా మిగిలిపోయిన దొడ్డు బియ్యం నిల్వలు రేషన్ దుకాణాలలో పేరుకుపోయాయి. పోర్టబులిటి సౌకర్యంతో డీలర్లు కోటాకు మించి బియ్యం తీసుకునే వెసులుబాటు ఉండటంతో ఇప్పుడు అదే రేషన్ డీలర్లకు ఇక్కట్లను తెచ్చి పెడుతోంది. పంపిణీలో ఈసారి ఆలస్యం కావడంతో మెజార్టీ డీలర్లు ఎక్కువ మొత్తంలో బియ్యాన్ని రేషన్ షాపులలో పెట్టుకున్నారు. తీరా ప్రభుత్వం ఈ నెల నుంచి సన్నబియ్యం పంపిణీకి ఏర్పాట్లు చేయడంతో దొడ్డు బియ్యం నిల్వలు అలాగే రేషన్ షాపులలో మిగిలిపోయాయి. ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపుల ద్వారా బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉండగా గత నెలలో కేటాయింపులు ఆలస్యం కావడంతో బియ్యం పంపిణీ ఆలస్యంగా జరిగింది. పోర్టబులిటి సౌకర్యంతో కార్డుదారులు రాష్ట్రంలో ఎక్కడైనా బియ్యం తీసుకునే అవకాశం ఉండటంతో రేషన్ డీలర్లు తమ కోటాకంటే మించి దొడ్డు బియ్యం తీసుకున్నారు. ఈనెల నుంచి అన్ని రేషన్ దుకాణాలలో సన్నబియ్యం పంపిణీ చేస్తుండటంతో దొడ్డు బియ్యం నిల్వలు భారీగా మిగిలి పోయాయి. ప్రభుత్వం నుంచి దొడ్డుబియ్యం తిరిగి తీసుకునే విషయంలో స్పష్టత లేకపోవడంతో చిన్న గదులలో కొనసాగుతున్న రేషన్ షాపులలో దొడ్డు బియ్యం నిల్వలు ఉండటంతో సన్నబియ్యం ఎక్కడ పెట్టాలో తెలియని పరిస్థితి నెలకొంది. పౌరసర ఫరాల అధికారులు మాత్రం ఏ రేషన్ షాపులో ఎంత నిల్వలు ఉన్నాయి అనేది స్పష్టంగా చెప్పలేక పోతున్నారు. నిల్వలు అయిపోయాయని నివేదిక పంపితేనే సన్న బియ్యం ప్రతీ రేషన్ దుకాణానికి ప్రభుత్వం సరఫరా చేసే అవకాశాలు ఉండటంతో అధికారులు అన్ని రేషన్ షాపులలో నిల్వలు లేవని నివేదికలు ఇచ్చినట్లు తెలుస్తోంది. అధికారులు నిల్వలు లేవని నివేదికలు ఇవ్వగా రేషన్ షాపులలో మాత్రం క్వింటాళ్లలో దొడ్డు బియ్యం నిల్వలు ఉండటంతో రేషన్ డీలర్లు తలలు పట్టుకుంటున్నారు.

ప్రతినెలా 8,248 మెట్రిక్ టన్నుల పంపిణీ..

జిల్లాలోని 759 రేషన్ దుకాణాల ద్వారా 8,248 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రతినెలా పంపిణీ చేస్తున్నారు.

మిగతా 8వ పేజీలో...

ఉన్నతాధికారుల ఆదేశాల కోసం చూస్తున్నాం..

: అర్వింద్‌రెడ్డి, డీఎస్‌వో

రేషన్ దుకాణాలలో నిలువ ఉంచిన దొడ్డు బియ్యం విషయంలో ఉన్నతాధికారుల నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు. దొడ్డు బియ్యం కోటా పూర్తిగా అయిపోయినట్లు నివేదికలు పంపితేనే రేషన్ షాపులకు సన్నబియ్యం కోటా వచ్చింది. రేషన్ షాపుల వారీగా దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నతాధికారులకు పంపించాం. ఉన్నతాధికారుల ఆదేశాల కోసం చూస్తున్నాం.





రేపు ఉద్యోగమేళా

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కోసం ఈనెల 17న ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఆర్ఎఫ్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటీవ్, మిషన్ ఆపరేటర్ ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 10వ తరగతి ఫెయిల్, ఐటీఐ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు జాబ్ మేళాలో పాల్గొనవచ్చని ఆయన అన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు సదాశివ్‌పేట్, సంగారెడ్డిలలో పనిచేయాల్సి ఉంటుందని ఆసక్తిగల అభ్యర్థులు గురు వారం నిర్వహించే జాబ్‌మేళాకు ఉదయం 10.30లకు నిజామాబాద్‌లోని ఐటీఐలోగల ఉపాధి కార్యాలయంలో హాజరుకావాలన్నారు. అభ్యర్థులు తమ వెంట బయోడాటా, ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, ఫొటో తీసుకురావాలని ఇతర వివరాలకు 9948748428, 6305743423 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు రాక

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం జిల్లాకు రానున్నారు. ఉదయం 7గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 10.30లకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ చేరుకోనున్నారు. 10.45కు కలెక్టరేట్‌లో వ్యవసాయ, పౌరసరఫరాల, మార్కెటింగ్, హెల్త్, గ్రామీణ నీటిపారుదల తదితర పథకాల గురించి ఆయన సమీక్షించనున్నారు. 1.45కు ఆర్మూర్‌లో సన్నబియ్యం లబ్ధిదారుల ఇంట్లో భోజనం చేయనున్నారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నారు. సాయంత్రం 5గంటలకు భీంగల్ నుంచి మోర్తాడ్ చేరుకొని అప్పుడు నుంచి హైదరాబాద్‌కు తిరిగి వెళ్లనున్నారు.

వర్నిలో బాజిరెడ్డి పర్యటన



వర్నిలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే

వర్ని,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): వర్ని మండల కేంద్రంలో మంగళవారం బాన్సువాడ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పర్యటించారు. బాన్సువాడలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు తరలివెళ్తూ వర్నిలో పార్టీ కార్యకర్తలను కలిశారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జై తెలంగాణ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎజాజ్, తాహెర్, అంబెం నరేందర్, నరెడ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సొంత గూటికి చేరిన మాజీ సర్పంచ్‌లు



మాజీ సర్పంచ్‌లకు ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మెండోర, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ పార్టీ నుండి మాజీ సర్పంచ్‌లు మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో తిరిగి బీఆర్ఎస్ పార్టీల చేరారు. ఈ సందర్భంగా సోన్‌పేట్ మాజీ సర్పంచ్ గోలి ప్రకాష్, దూదిగాం మాజీ సర్పంచ్ పసుల శ్రీనివాస్‌ల మిత్ర బృందంకు ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పూర్తిగా భ్రమలు తొలిగిపోయాయని ప్రజలు, నాయకులు, కార్యకర్తలు మళ్ళీ బీఆర్ఎస్ వైపు చూస్తున్నారు.ఈకార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మండల అధ్యక్షుడు నాగంపేట్‌శేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కమలాకర్, మాజీ ఎంపీటీసీ దేవేందర్,బాబా,మాజీసర్పంచ్‌లు నాగుల నర్సయ్య,గంగారెడ్డి, రాజారెడ్డి, గంగారెడ్డి, యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్‌రూరల్,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):మండలంలోనిగోను గొప్పుల గ్రామా నికి చెందిన గోపరి ఒడ్డన్న అనే వ్యక్తి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైయివేట్ ఆసుపత్రిలో చేరారు.ఆయన నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి అని వైద్యఖర్చులు భరించలేని పరి స్థితిలో ఉండడంతో గ్రామ బీఆర్ఎస్ నాయకులు బాల్కొండ ఎమ్మె ల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో వైద్య చికిత్స కోసం రూ.లక్ష10వేల ఎల్‌వోసీ ప్రభుత్వం నుంచి మంజూరు చేయించి మంగళవారం వేల్పూర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మంజూరు పత్రా న్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.మంజూరుకు కృషి చేసిన ప్రశాంత్‌రెడ్డికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బోధన్‌రూరల్,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): అనుకోకుండా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బోధన్ ఇన్‌చార్జి అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని రైల్వే స్టేషన్, ఆర్టీసీ డిపో, బస్ స్టేషన్ ప్రాంతాలలో అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో బోధన్ రైల్వే స్టేషన్ మేనేజర్ రాములు, ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్, అగ్నిమాపక సిబ్బంది శ్రీనివాస్, ఆనంద్, రాహుల్, మొసిన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

'కులధ్రువీకరణ పత్రం ఇవ్వడం లేదు'



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మహమ్మద్‌నగర్,ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గాలిపూర్ గ్రామంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావును నాయక్ పోడ్ కులస్తులు కలిశారు.ఈసందర్భంగా నాయక్ పోడ్ జిల్లా అధ్యక్షుడు మెట్టపెంటయ్య మాట్లాడుతూ తహసీల్ధార్‌కు కులధ్రువికరణ పత్రం ఇవ్వాలని పలుమార్లు కలిసిన పత్రం జారీచేయకపోగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యేకు తెలిపారు.బాన్సువాడ సబ్ కలెక్టర్ వద్దకు, తహసీల్ధార్ కార్యాలయాలకు మూడునెలలుగా తిరిగిన స్పందించడం లేదని ఆరోపించారు. వెంటనే ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్‌కు ఫోన్‌చేసి నాయక్‌పోడ్ కులధ్రు వీకరణ పత్రాల గురించి తెలియజేసి వారి సమస్యను తీర్చాలని కోరారు. ఈ కార్యక్ర మంలో మార్కెట్ కమిటి చైర్మన్ మనోజ్, మం డలల అధ్యక్షులు మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, జిల్లాఎస్‌టీసెల్ ఉపా .ధ్యక్షుడు లోక్య నాయక్, ఆకాష్, నాయక్‌పోడ్ సంఘనాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల పరిశీలన పూర్తి చేయాలి

నిజాంసాగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అర్హులైన దరఖాస్తుదారుల దరఖాస్తులను త్వరితగతిన పరిశీల పూర్తి చేయాలని ప్రత్యేక అధికారిని ప్రమీల తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ప్రజాపాలనగా వచ్చిన ఇందిరమ్మ ఇండ్ల రేషన్ కార్డుల, ఎన్‌ఆర్‌ఇజీఎస్, ఎల్‌ఆర్‌ఎస్‌పై వచ్చిన దరఖాస్తులను గ్రామాల వారీగా గ్రామపంచాయతీ కార్యదర్శులు పరిశీలి పరిశీలన చేసి నివేదిక అందించాలని అన్నారు. ఈ సమావేశంలో తహసిల్దార్ బిక్షపతి, ఎంపీడీవో గంగాధర్, ఏపీ శివకుమార్‌తో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు

ఎంపీడీవోలో అంబేద్కర్ ఫొటో ఏర్పాటు చేయాలి

కోటగిరి,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఫోటోను ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేయకపోవడం అత్యంత బాధకరమని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకులు పోచీరాం ఆవేదన వ్యక్తం చేశారు.పొతంగల్ మండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటం లేకపోవడంతో మంగళవారం ఆయన నిరసనవ్యక్తం చేశారు.ఎంపీడీవో కార్యాలయంలో సీఎం,ఎమ్మెల్యే పోచారం, ఫోటోలు మాత్రమే ఏర్పాటు చేశారన్నారు.ఈవిషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.మండల పరిషత్‌లో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించకపోవడంపై ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రాజ్యాంగ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలి

● రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్



రుద్రూరులో పాదయాత్ర నిర్వహిస్తున్న తాహెర్‌బిన్ హందాన్

కోటగిరి,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వాతంత్ర సమరయోధులను, రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాతను అవమానపరుస్తుందని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ ఆరోపించారు. రుద్రూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మహాత్మ గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలతో ప్రధాన వీధుల గుండా నినాదాలు చేస్తూ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు పాటుపడాలని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం తమ వాటా ఉందని గొప్పలు చెప్పడం సిగ్గుచేటన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాలలో సన్న బియ్యం ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు. బీజేపీ మాటలు విని మోసపోవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణలో సుస్థిరపాలన సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్, అరుణ్ కుమార్, గంగారాం, గంగాశంకర్, నాగేష్, ప్రవీణ్, సురేష్, అశోక్,షేక్.గౌస్,సంగయ్య, కార్తీక్,సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

సుంకెట్,మోర్తాడ్‌లో అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవం



పోషణ పక్షం కార్యక్రమంలో పాల్గొన్న ఏసీడీపీవో జ్ఞానేశ్వరి, సూపర్‌వైజర్ మంజుల

మోర్తాడ్ ,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):మండలంలోని సుంకెట్, మోర్తాడ్ గ్రామాల్లోని అంగన్‌వాడి కేంద్రాలలో పోషణ పక్షం కార్యక్రమాలు భారీగా నిర్వహించారు.సుంకెట్ గ్రామంలో అన్ని అంగన్‌వాడి కేంద్రాలు కలిసి ఒకచోట పోషణ పథకం ప్రారంభించారు. గర్భిణులకు రక్త పరీక్షలు, సీమంతాలు, అన్నప్రసన, అక్షరభ్యాసం, కిషోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించి హిమోగ్లోబిన్ శాతం నిర్ధారించివారి తల్లులకు ఎటువంటి పోషకాహారం ఇవ్వాలో వివరించి చెప్పారు. మోర్తాడ్‌లో కూడా జరిగిన పోషణ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు జ్యోతి, శారద,రిషిక్,సుజాత,రాజేశ్వరి,స్వర్ణలత, అంజమ్మ, సుమలత,ఆశారేఖ పాల్గొన గా సుంకెట్‌లో ఏసీడీపీవో జ్ఞానేశ్వరి, సూపర్ వైజర్ మంజులా, అంగన్‌వాడి టీచర్లు దేవగంగు,పుష్పలత,సుజాత,స్వప్న,ఆయాలు, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

డొంకేశ్వర్:పిల్లల శారీరక , మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ అన్నపూర్ణ మంగళవారం పోషన్‌పక్షం కార్యక్రమంలో భాగంగా సామూ హిక సీమంతాలు, అన్న ప్రసన, పౌష్టికాహారం మహోత్సవం కార్యక్రమా లను మండలంలోని గాదెపల్లి అంగన్‌వాడి కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ బరువు తక్కువగా ఉన్న చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఎప్పటికప్పుడు పిల్లల బరువు, ఎత్తు చూసి తల్లిదండ్రులకు తెలియజేయాలని అంగన్‌వాడి టీచర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ కళావతి, ఎంఎల్‌హెచ్‌పి అమూలయ రజిని, రామ కృష్ణ, నాగరాజ్, అచ్యుత్‌రెడిడ, రాజన్న, అంగన్‌వాడి టీచర్‌లు తదితరులు పాల్గొన్నారు.

● కల్దుర్కిలో పోషణ పక్వాడ

బోధన్‌రూరల్: గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోపిలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని కల్దుర్కి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా వెయ్యి రోజుల ప్రాముఖ్యత గురించి గర్భవతి నుండి రెండు సంవత్సరాల పిల్లల వరకు అందించే పౌషికాహారం గురించి వివరించారు. ఈకార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ సునీత, సైన్స్ ఉపాధ్యాయురాలు నవత కుమారి, వైద్యసిబ్బంది శిల్ప, అంగన్‌వాడీ టీచర్లు వత్సల, సాయమ్మ, సునంద తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ముత్యాల సునీల్ కుమార్

● బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్

మోర్తాడ్,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):బాల్కొండ నియోజకవర్గ ప్రజలకు సంక్షే మ పథకాలు అందకుండా ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని బదునం చేయాలని చూస్తున్నారని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్ ధ్వజమెత్తారు. మండళవారం మోర్తాడ్‌లోని ప్రజా భవనంలో విలేకరులతో మాట్లాడారు. కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ప్రజలకు పంపిణీ చేయకుండా ప్రభుత్వాన్ని అబాసు పాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని సునీల్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్యేగా ప్రశాంత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ప్రోటోకాల్ గౌరవము ఇచ్చిన దాన్ని కాపాడుకోవడం లేదని ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందకుండా అహాకారం ప్రదర్శిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రజలు పెద్దగా ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పిస్తు బ్రోకర్ వ్యవస్థను నిర్మూలించిందని అన్నారు. చెక్కుల గడువు ముగిసిపోతుందని హెచ్చరించిన ఎమ్మెల్యే అధికార దర్పాన్ని చూపించడం వల్ల నియోజకవర్గానికి మంజూరైన 513 కల్యాణ చెక్కులు గడువు ముగిసిపోతే ప్రభుత్వానికి మాట్లాడి వాటిని రినివల్ చేయించామని సునీల్ కుమార్ అన్నారు. ఇప్పటి కూడా చెక్కులు పంపిణీ చేయకుండా అధికారులను తప్పుతోవ పట్టిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో రూ. 6వేలకు ఉన్న ట్రాక్టర్ ఇసుకను ప్రభుత్వంతో మాట్లాడి రూ. 2వేల 300 నుండి, 3వేల 300 మధ్యలోనే ఇసుకను అందించి సామాన్యులకు అండగా ఉంటున్నామని సునీల్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిజాయితీగా నిబందతతో క్రమశిక్షణతో ప్రజా పాలన కొనసాగిస్తుందని, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి విమర్శించడం ఏది తెలియదని సునీల్‌కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు ముత్యాల రాములు, శివనోల్లశివకుమార్, సుంకెటరవి,నర్సయ్య, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

ఏర్గట్ల:మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మంగళవారం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామపార్టీమాజీ అధ్యక్షుడు రాజారాం సహదేవ్‌తో పాటు చిన్న భూమన్నలు చేరగా సునీల్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వా నించారు. ఈకార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, ముస్కు మోహన్, బద్దం లింగారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, ఓర్సు రాములు, దండెవోయిన సాయి కుమార్‌లు పాల్గొన్నారు

వరంగల్‌లో జరిగే సిల్వర్ జూబ్లీని విజయవంతం చేయాలి

● జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే



మహ్మద్‌నగర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

నిజాంసాగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్ర సమితి ఆవిర్భావం 25 సంవత్సరాలు పూర్తి అయినప్పటికీ పార్టీ సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని ఈనెల 27వ తేదీన వరంగల్‌లో నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే మాజీ హనుమంత్ షిండే పిలుపునిచ్చారు. మంగళవారం నిజాంసాగర్ మండల కేంద్రంలో టీఆర్ఎస్ కార్యాలయంలో నాయకుల కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సిడిసి చైర్మన్ మాజీ ఎంపీపీ జ్యోతి దుర్గా రెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షులు గైని విట్టల్, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు రమేష్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ మనోహర్, పిఎసిసి ఎస్ అధ్యక్షులు నరసింహారెడ్డి, కళ్యాణి విట్టల్ రెడ్డి, మాజీ సర్పంచ్లు, ఎంపిటిసిలు తదితరులున్నారు.

మహమ్మద్‌నగర్: బీఆర్ఎస్ బహిరంగసభకు కార్యకర్తలు, రైతులు భారీగా తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అన్నారు. మంగళవారం మండలంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. ఈనెల 27 న బీఆర్ఎస్ వరంగల్‌లో రజోత్సవ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ సాధించిన మాజీ సీఎం కేసీఆర్‌ను ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సత్యనారాయణ, సీనియర్ నాయకులు గంగారెడ్డి,మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, లక్మారెడ్డి, మనిష్‌రెడ్డి, మహేందర్, అమిర్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు సౌత్‌క్యాంపస్‌లో శిక్షణ ప్రారంభం

భిక్కనూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పది రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మోహన్‌బాబు, అంజయ్య, హరిత, సబిత, లలిత, ప్రతిజ్ఞ, ఫౌండేషన్ ప్రతినిధులు సృజన్, సుప్రితా, బాలక్రిష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న తక్కడ్‌పల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా మహిళా సంఘాలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ప్రతి మండలంలో కొన్ని వరికొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలను అప్పగించింది. దీంట్లో భాగంగానే చిన్న తక్కడ్‌పల్లి గ్రామంలో గల రెండు కేంద్రాలను అధికారులు ఐకెపి మహిళా సంఘాలకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగనాథ్, ఎంపిడివో లక్ష్మీకాంత్ రెడ్డి, గ్రామ మహిళ సంఘం అధ్యక్షురాలు నాగమణి, ఏపిఎం దూప్‌సింగ్, సిసిలు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బోధన్‌రూరల్,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాడిజమాల్‌పూర్ గ్రామానికి చెందిన సుజాత(35)అనే వివాహిత మహిళ ఈ నెల 11వ తేదిన గుర్తు తెలియని పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ జిల్లా ఆసుపత్రిలో మంగళవారం మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. సుజాతకు 18సంవత్సరాల క్రితం నాగేష్ అనే వ్యక్తితో వివాహం జరిగిందని, ఇద్దరు కుమారులు ఉన్నారని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బోధన్‌రూరల్,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):బోధన్ మండలంలోని పెగడాపల్లి వెళ్లే రోడ్డులో ఉన్న లంగ్డాపూర్ బ్రిడ్జి సమీపంలో సోమవారం అర్ధరాత్రి లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడని బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు.గ్రామస్థుల ద్వారా విషయం తెలుసుకుని ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.మృతుడు మోస్రా మండలం గోవూరు గ్రామానికి చెందిన లాలుగాగుర్తించామన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.లారీని అదుపులోకి తీసుకున్నామన్నారు.

ఆర్మూర్ రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని క్లాక్ టవర్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వడ్డే గంగాధర్ (55) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని జిరాయత్ నగర్‌లో నివాసం ఉంటున్న గంగాధర్ సొంత పనుల నిమిత్తం ఎక్సెల్ బైక్ పైన కొత్తబస్టాండ్ ప్రాంతానికి వస్తుండగా క్లాక్ టవర్ వద్ద సిమెంట్ లారీ ఎక్సెల్‌ను డీ కొట్టింది. దీంతో గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీస్ లు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చెరువులో పడి బీఆర్ఎస్ నాయకుడి మృతి

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గూండ్ల చెరువు లో పడి బీఆర్ఎస్ నాయకుడు కుంట గంగామోహన్‌రెడ్డి (65) మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. సోమవారం సాయం త్రం చెరువులో బట్టలు ఉత్తుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. కుంట గంగామోహన్‌రెడ్డి టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీలో చురుకుగా పనిచేశారు. పార్టీ అధి కారంలోకి రాకముందు,సకలజనుల సమ్మెసమయంలో పలువురు టీఆర్ ఎస్ నాయకులతో కలిసి అనేక ఉద్యమాలు చేశారు. మంగళవారం బం ధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయ న తెలిపారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మినీ ట్యాంక్ బండ్‌పై జ్యోతిబాపూలే, సావిత్రి బాయి పూలే విగ్రహాలు ఏర్పాటు చేయాలి

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పెద్ద చెరువు వద్ద నిర్మిస్తున్న మినీ ట్యాంక్ బండ్ వద్ద మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్, విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, బీసీ నాయకులు సతీష్, బహుజన సమాజ్ పార్టీ నాయకులు సాయిబాబు మంగళవారం వినతిపత్రం అందజేశారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబాపూలే అనాధ పిల్లలను ఆదుకున్న మహా వ్యక్తి అని ఆయన చేసిన సేవలను కొనియాడారు.

మాజీ ఎమ్మెల్యే కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ



మాజీ ఎమ్మెల్యే షకీల్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి

బోధన్‌రూరల్,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుటుంబాన్ని మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మాజీమంత్రి హరీష్ రావు పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే షకీల్ మాతృమూర్తి మృతిపట్ల విచారం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే మాతృమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తదితరులున్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత



ప్రీతమ్ దేశాయ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు

బోధన్‌రూరల్,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సునీతా దేశాయ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్ రావు దేశాయ్ కుటుంబాన్ని మంగళవారం ఎమ్మెల్సీ కవితతో పాటు మాజీ ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్‌లు పరామర్శించారు. ఇటీవల వారి పెద్ద కుమారుడు ప్రీతమ్ దేశాయ్ గుండెపోటుతో మృతి చెందాడు. మంగళవారం వెంకటేశ్వర్ రావు దేశాయ్ కుటుంబాన్ని పరామర్శించి ఎమ్మెల్సీ కవిత ఓదార్చారు. ప్రీతమ్ దేశాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రీతమ్ దేశాయ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, సాలూర షకీల్, గుమ్ముల అశోక్, గిర్ధావర్ గంగారెడ్డి, రుద్ర సత్యనారాయణ, రవి శంకర్ గౌడ్, పలువురు నాయకులు తదితరులున్నారు.

జానకంపేటలో పెద్దమ్మ తల్లి బోనాలు

ఎడపల్లి, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామంలో మంగళవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. భాజా భజంత్రీల నడుమ బోనమెత్తిన గ్రామ ముదిరాజ్ కులస్థులు సామూహికంగా గ్రామ శివారులో గల పెద్దమ్మ తల్లి ఆలయం వరకు నడిచి వెళ్లి బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ముదిరాజ్ కులస్థులు తదితరులు పాల్గొన్నారు.

'గీత కార్మికులను వీడీసీ బహిష్కరించలేదు'



తాళ్లరాంపూర్‌లో మాట్లాడుతున్న వీడీసీ సభ్యులు

ఏర్గట్ల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి):తాళ్లరాంపూర్‌లోని గీత కార్మికులను మేము బహిష్కరించలేదని తాళ్లరాంపూర్ వీడీసీ సభ్యులు తెలిపారు. మంగళవారం గ్రామంలో వీడీసీ సభ్యులు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గీత కార్మికులను బహిష్కరణ చేయలేదని, వారికి సంబంధిచిన చెట్లను వీడీసీ దహనం చేసినట్లు సీపీఎం నాయకులు నిజనిజాలు తెలుసుకోకుండా మాట్లాడటం సరికాదని అన్నారు. తమ దగ్గర ఆధారాలు ఉన్నాయని మేము దేనికైనా సిద్ధమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు బోనగిరి దేవన్న, ఉపాధ్యక్షుడు తమ్మడి రాకేష్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

బోనస్ కాజేసిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి



కోటగిరి సొసైటీలో అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఐ నాయకులు

కోటగిరి,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):రైతుల బోనస్‌ను రాజకీయ ముసుగులో కాజేసిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ డిమాండ్ చేశారు. కోటగిరి సహకార సంఘంలో బోనస్ అక్రమాలపై విచారణ జరిపేందుకు వచ్చిన అధికారులకు మంగళవారం సీపీఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్‌లో బోనస్ కోసం బోగస్ రైతులను సృష్టించి పలువురు రైస్‌మిల్లర్లు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై సుమారు 20లక్షల రూపాయల బోనస్ కాజేసినట్లు ఆయన పేర్కొన్నారు. సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో దశల వారిగా ఉద్యమాలు చేపట్టడంతో జిల్లా అధికారులు విచారణకు ఆదేశించడం శుభ పరిణామం అని పేర్కొన్నారు. అధికారులు రాజకీయ నాయకుల బెదిరింపులకు భయపడకుండా సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సంఘంలో బోనస్ కాజేసిన ఏడుగురు వ్యక్తులకు నోటీసులు జారీ చేయడం స్వాగతిస్తున్నామన్నారు. సమగ్ర విచారణ చేపట్టి బోనస్ కాజేసిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాన్ని మోసం చేసిన వ్యక్తుల పేర్లను విచారణ అనంతరం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. నిధులను రికవరీ చేసి సహకార సంఘానికి జమ చేయాలని కోరారు. అక్రమార్కులను తప్పించే ప్రయత్నం చేస్తే సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గంగాధర్,రాములు, రాజు పాల్గొన్నారు.

నెల రోజులైనా కొనుగోలు కేంద్రం కరువు

భీమ్‌గల్, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):వరికోతలు కోసిధాన్యం కుప్పలుపోసి నెల రోజులైనా కాంట పెడుతలేరని సిద్దపల్లి గ్రామానికి చెందిన రై తులు మంగళవారం భీమ్‌గల్ సొసైటీకి తరలివచ్చి చైర్మన్, కార్యదర్శి నిలదీశారు. తమ పక్క గ్రామమైన బెజ్జోరలో కొనుగోలు కేంద్రం ప్రారం భం చేసి 15 రోజులు గడిచినప్పటికి మాగ్రామంలో కాంటఏర్పాటు చేయకపోవడంతో ఎక్కడ పోసినా కుప్పలు అక్కడే ఎండకు ఎండిపోతు న్నాయని ఈ విషయమై సొసైటీ కార్యదర్శికి ఎన్నిసార్లు విన్నవించిన హామాలీ,సంచుల కొరత ఉందని దాట వేస్తూ జాప్యం చేస్తున్నారని దీంతో ప్రతినిత్యం కుప్పల వద్ద రాత్రి,పగలు వేళల్లో నిరీక్షించాల్సిన పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు. మరో రెం డు రోజుల్లో తూకం ప్రారంభి స్తామని చైర్మన్, కార్యదర్శి హామీ ఇవ్వడంతో వెనుదిరిగారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

నవీపేట,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు రోజుల క్రితం డ్రంకెన్‌డ్రైవ్‌లో మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరిని మంగళవారం కోర్టులో హాజరుపర్చడం జరిగిందని ఎస్సై వినయ్ తెలిపారు. మండలంలోని అభంగపట్నంకు చెందిన వ్యక్తితో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన మరో వ్యక్తి మద్యం తాగి వాహనాలు నడుపగా వీరిని మంగళవారం కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ న్యాయాధికారి నూర్జహాన్ బేగం ఒక్కొక్కరికి రెండు రోజుల జైలుశిక్ష విధించడం జరిగిందని ఎస్సై పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని ఎస్సై అన్నారు.

సాటాపూర్‌లో..

రెంజల్: మద్యం తాగి వాహనం నడిపిన మహారాష్ట్రకు చెందిన మధుకర్ కాంబ్లే అనే వ్యక్తికి ఒకరోజు జైలుశిక్ష విధించినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో సోమవారం వాహనాల తనిఖీల్లో భాగంగా మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తిని మంగళవారం బోధన్ కోర్టులో హాజరుపర్చగా సెకండ్ క్లాస్ న్యాయాధికారి శేషతల్ప సాయి ఒక రోజు జైలుశిక్ష విధించారని ఎస్సై తెలిపారు. మరో వ్యక్తికి రూ.4వేల జరిమాన విధించినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్సై పేర్కొన్నారు.



- ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే భూ వివాదాలు
- పరిష్కారాల కోసం ఎదురుచూస్తున్న ఆశావహులు

భూ భారతితో..

సమస్యలు తీరేనా?

ఇందల్వాయి,ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి పోర్టల్ ద్వారా రైతుల సమస్యలు తీరనున్నాయా లేక ధరణి మాదిరిగానే ఏళ్ల తరబడి రెవెన్యూసేవలు పెండింగ్‌లోనే కొనసాగుతాయా అనే అంశంపై రైతులు చర్చించు కుంటున్నారు. గత ప్రభుత్వం ధరణి పోర్టల్ ప్రవేశపెట్టినా అనేక భూ సంబంధిత సమస్యలు అలాగే నిలిచిపోయాయి. దీంతో రైతులు ఏం చేయలేక ఏళ్ల తరబడి ఎదురు చూశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ధరణి స్థానంలో అనేక మార్పులుచేసి రాష్ట్రంలో భూ సమస్యలు లేకుండా ఉండాలనే ఉద్దేశంతోనే భూ భారతి పోర్టల్‌ను ఏప్రిల్ 14న ప్రారంభించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూసమస్యలకు భూ భారతి ద్వారా పరిష్కారం అందించాలని రైతులు ఎదురు చూస్తున్నారు.

● పెండింగ్‌లో ఎన్నో దరఖాస్తులు

ధరణిలో ఎంతోమంది రైతుల భూములు రికార్డులు ఇతరుల పేర్లపై ఆన్‌లైన్‌లో నమోదయ్యాయి. అసైన్డ్‌మెంట్ భూములు సాదాబైనామా కేసులు ఉన్న భూమి కంటే తక్కువగా భూమిధరణిలో నమోదు ఆర్‌ఎస్‌ఆర్ లాంటి అనేక సమస్యలు ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా పనులు అక్కడే నిలిచి పోయాయి.

● ప్రధాన సమస్యలు ఇవే..

గ్రామీణ ప్రాంతాల్లో పట్టాభూములు అసైన్డ్ భూములుగా నమోదు కావడం, సాదాబైనామా భూములు, ఒకరి భూమి మరొకరి పేరుపై నమోదు, వ్యవసాయభూములు ఆబాదిగా నమోదు, భూ విస్తీర్ణంలో హెచ్చుతగులు లాంటి సమస్యలను రైతులు ప్రధానంగా ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి పోర్టల్ ద్వారా రైతుల సమస్యలు తీరుతాయని ఎదురు చూస్తున్నారు.

9 ఏళ్లుగా పట్టా మారలేదు..

● టెక్మాల్ నరేందర్, సిర్నాపల్లి గ్రామస్థుడు



సిర్నాపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దగ్గర 9ఏళ్ల క్రితం ఎకరం 3ఇసాల భూమి కొన్నాను. డిజిటల్ సైనింగ్, ఆధార్ కేవైసీ పెండింగ్‌తో భూమి పెండింగ్‌తో కొనుగోలు చేసిన వ్యక్తిపై పట్టామార్పిడీ కావడం లేదు. కొత్త పాస్‌బుక్‌లు సైతం రాలేదు. ఏం చేయాలో తోచక వదిలేశా.

భూ భారతి కోసం ఎదురుచూస్తున్నా

● గంగారాం, నల్లవెల్లి గ్రామస్థుడు



వారసత్వంగా నాలుగు ఎకరాల అసైన్డ్ భూమి నాకు వచ్చింది. అసైన్డ్ భూమి కాసులో నేనే ఉన్నా పట్టా మాత్రం వేరొకరి పేరుపై నమోదైంది. ధరణి కారణంగా భూమిని కోల్పోయా. రికార్డులో నా పేరు లేదు. భూ భారతి ద్వారానైనా నా సమస్య తీరుతుందని ఆశిస్తున్నా.

భూ భారతితో సమస్యలు పరిష్కరిస్తాం

● వెంకట్రావ్, తహసీల్దార్

భూ భారతి ద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతాయి. ధరణిలో 33 మాడ్యూల్స్ ఉండగా భూభారతిలో తగ్గిస్తున్నారు. మరికొద్దిరోజుల్లోనే దిశానిర్దేశాలు వస్తాయి. త్వరలోనే రైతులు సమస్యలను పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గ్రామాభివృద్ధి కమిటీల

దౌర్జన్యాన్ని అరికట్టాలి

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): బహిష్కరణ పేరుతో దౌర్జన్యాలకు పాల్పడుతున్న వీడీసీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పలుచోట్ల సీపీఎం నాయకులు మంగళవారం ధర్నా చేపట్టారు. ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో గీత కార్మికుల కుటుంబాలపై బహిష్కరణ విధించిన వీడీసీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్డీవో ఆఫీస్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య, తాళ్లరాంపూర్ మాజీసర్పంచ్ కోటగిరి రామాగౌడ్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామ కమిటీల నిరంకుశ చర్యలకు అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలలో వీడీసీల ఆగడాలు ఎక్కువయ్యాయన్నారు. ఆర్మూర్ సబ్ డివిజన్‌లోని అన్ని గ్రామాలలో వీడీసీలు సమాంతర ప్రభుత్వాలను నడుపుతున్నారని తమ మాట వినని వారికి కుల బహిష్కరణ చేస్తూ జరిమానాలు విధిస్తున్నారని వారన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా వీడీసీలను నిషేధించాలని డిమాండ్‌చేశారు. ఈనెల 22న చలో ఆర్మూర్ కార్యక్రమాన్ని చేపట్టామని ప్రజా సంఘాలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు భూమన్న, కుందీ ప్ శర్మ, గంగాశంకర్, నాగరాజు, సాయిలు, ఓంకార్ పాల్గొన్నారు.

వీడీసీలను నిషేధించాలి: సీపీఎం

వర్ని: చట్టబద్ధత లేని గ్రామాభివృద్ధి కమిటీలు గ్రామాల్లో సమాంతర ప్రభుత్వాలను నడుపుతూ అణగారిన బడుగు, బలహీన ప్రజలను సాంఘిక బహిష్కరణ చేస్తూ చట్టాన్ని ధిక్కరిస్తున్నాయని, వాటిని ప్రభుత్వం వెంటనే నిషేధించాలని సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కమిటీ పిలుపుమేరకు మంగళవారం గ్రామాభివృద్ధి కమిటీలను నిషేధించాలని కోరుతూ వర్ని తహసీల్దార్ సాయిలుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం నన్నేసాబ్ మాట్లాడుతూ ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో గీత కార్మికులు గ్రామాభివృద్ధి కమిటీ మాట వినడం లేదని కల్లు గీత కార్మికుల కుటుంబాలను సాంఘిక బహిష్కరణ చేశారని మండిపడ్డారు. ఈత వనాలను తగలబెట్టి భయభ్రాంతులకు గురిచేయడం అన్యాయమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాయిబాబు, గాయత్రి ఉన్నారు.

● సీపీఎం నాయకులు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

వీడీసీలపై చర్యలు తీసుకోవాలి

బోధన్‌రూరల్: ఆర్మూర్ డివిజన్‌లో కొనసాగుతున్న వీడీసీలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు బోధన్ తహసీల్దార్ విఠల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు శంకర్‌గౌడ్ మాట్లాడుతూ ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో కల్లు గీత కార్మికులపై వీడీసీలు దౌర్జన్యం చేస్తూ వారి కుటుంబాలను బహిష్కరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శ్రీరామ నవమి రోజు గౌడ మహిళలను గుడి నుంచి వెళ్లిపోవాలని ప్రకటించడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్‌తో పాటు పోలీసు ఉన్నతాధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దాసి గోపి, ప్రభాకర్, కాశీనాథ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులున్నారు.



పూజలో పాల్గొన్న బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ఘనంగా గంగమ్మ ఆలయ వార్షికోత్సవాలు

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బషీరాబాద్ కాడిచెరువు వద్ద కొలువుదీరిన గంగపుత్రుల ఆరాధ్య దైవం గంగమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో మూడోరోజైన మంగళవారం బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి గంగామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయా ఆవరణ నుంచి ఆలయం వరకు ఆలయ నిర్వాహకులు, గంగపుత్ర సంఘసభ్యులు ఆలయ అర్చకులు జగదంబాదేవి ఉపాసకులు మంత్రాజ్యం కృష్ణమా చార్యులు, గంగమ్మ దీక్షపరులు పూర్ణకుంబాలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో సహస్ర కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించగా గంగపుత్ర సంఘ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఏనుగు గంగారెడ్డి, రాజాగౌడ్, బైకాని మహేష్, గంగపుత్ర సంఘం సుంకెట నారాయణ, ఉపాధ్యక్షుడు మోతే రవిందర్ సంఘ సభ్యులు గంగమ్మ దేవి దీక్షపరులు, గంగపుత్ర సంఘం, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఉన్నారు.



కుంకుమార్చనలో పాల్గొన్న గంగపుత్ర సంఘ మహిళలు

జానకంపేటలో ఫ్లెక్సీ వివాదం



పంచాయతీ కార్యదర్శితో గొడవ పడుతున్న ముదిరాజ్ కులస్థులు

ఎడపల్లి, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకంపేట గ్రామంలో మంగళవారం ఓ ఫ్లెక్సీకి సంబంధించిన వివాదం చోటుచేసుకుంది. గ్రామ కూడలిలో గల శివాజీచౌక్ వద్ద గ్రామ ముదిరాజ్ కులస్థులు పెద్దమ్మతల్లి బోనాల పండుగకు సంబంధించిన ఓ ఫ్లెక్సీని సోమవారం ఏర్పాటుచేశారు. మంగళవారం ఉదయం ఆ ఫ్లెక్సీ ఏర్పాటుచేసిన ప్రదేశంలో లేకపోవడంతోపాటు ఫ్లెక్సీ చిరిగిపోయి ఉండడంతో పెద్దఎత్తున గ్రామ ముదిరాజ్ కులస్థులు శివాజీచౌక్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఫ్లెక్సీని గ్రామ పంచాయతీ కార్యదర్శి అకారణంగా తొలగించారని, పండుగపూట ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని పండుగ పూర్తి కాకముందే తొలగించారని వారు ఆరోపించారు. ఘటన స్థలానికి చేరుకున్న పంచాయతీ కార్యదర్శి ప్రేమ్ దాస్ నాయక్ గ్రామస్థులకు సర్దిచెప్పారు. శివాజీ చౌక్‌లో ఏర్పాటు చేసిన పలు పార్టీల ఫ్లెక్సీలను తొలగించాలని పంచాయతీ సిబ్బందికి తెలపడంతో పలు పార్టీల ఫ్లెక్సీలతోపాటు ముదిరాజ్ కులస్థుల ఫ్లెక్సీని సైతం తమ సిబ్బంది తొలగించడంతో వివాదం చోటుచేసుకుందని తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారికి సర్దిచెప్పారు. నూతన ఫ్లెక్సీని ఏర్పాటుచేయిస్తానని పంచాయతీ కార్యదర్శి తెలుపడంతో వివాదం సద్దుమణిగింది. శివాజీ చౌక్‌లో నూతన ఫ్లెక్సీని పంచాయతీ కార్యదర్శి ఏర్పాటు చేయించారు.

19 నుంచి కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరవధిక సమ్మె

- ప్రిన్సిపాల్‌కు సమ్మె నోటీసు అందజేత
- పరిపాలన అదనపు బాధ్యతలకు కాంట్రాక్టు అధ్యాపకుల రాజీనామా

భిక్కనూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యల పరిష్కరించకపోవడాన్ని నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 19 నుంచి భిక్కనూరు మండలంలోని బీటీస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో నిరవధిక సమ్మెను చేపట్టనున్నట్లు సౌత్ క్యాంపస్ కాంట్రాక్ట్ అధ్యాపకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సమ్మె నోటీసును ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్‌కు కాంట్రాక్ట్ అధ్యాపకులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా యూనివర్సిటీల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే తమ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్న తమ గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. జీవో నెం.21ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోవడంతోనే తాము ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇకనైనా వెంటనే తమసేవలను గుర్తించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

● పరిపాలన అదనపు బాధ్యతలకు కాంట్రాక్టు అధ్యాపకుల రాజీనామా

కాంట్రాక్టు అధ్యాపకులపై ప్రభుత్వ తీరును నిరసిస్తూ సౌత్‌క్యాంపస్‌లోని కాంట్రాక్ట్ అధ్యాపకులు వారు నిర్వహిస్తున్న అదనపు పరిపాలన బాధ్యతలకు రాజీనామా చేసి ఆ పత్రాలను ప్రిన్సిపాల్‌కు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కోర్డినేషన్ సభ్యులు నారాయణ, కాంట్రాక్ట్ అధ్యాపకులు యాలాద్రి, సునీత, వైశాలీ, సరిత, నిరంజన్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న దృశ్యం

అన్నదాతల్లో అకాల వర్షభయం!

- పంట చేతికొచ్చే సమయంలో మబ్బులతో భయపెడుతున్న వరుణుడు
- రోజూ సాయంత్రం చల్లని గాలులు, చిరుజల్లులు
- ఆందోళన చెందుతున్న రైతులు



వరి ధాన్యాన్ని ఆరబెడుతున్న దృశ్యం

గ్రామాల్లో మొదలైన వరి పంట కోతలు



డొంకేశ్వర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆకాశం మేఘావృతమైంది. మండలంలో వారం రోజులుగా చల్లని గాలులతో చిరుజల్లులు కురుస్తుండడంతో ఎప్పుడు వర్షం కురుస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి పంట సాగు చేసిన రైతులకు పంట చేతికి అందే సమయంలో మబ్బులు కమ్ముకోవడంతో దిగులు చెందుతున్నారు. మండలంలో గ్రామాల్లో యాసంగిలో సాగుచేసిన వరి పంట కొంతమేర చేతికి అందింది. మరికొంత పంటలు కోతలు ఊపందుకున్నాయి. ఇప్పటికే హార్వెస్టర్‌లతో కోతలకు వీలుగా పంటను ఆరబెడుతున్నారు. వాతావరణ మార్పులతో ఆకాశంలో మబ్బులు రావడంతో రైతుల గుండెల్లో గుబులు రేపుతోంది. మండలంలో రెండు రోజుల క్రితం వేకువ జామున వర్షం కురవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట కోత కోసే సమయంలో వరుణ దేవుడు కరుణ చూపాలని వేడుకుంటున్నారు.

9వేల ఎకరాల్లో వరి సాగు

మండలంలోని 13 గ్రామపంచాయతీల్లో 9వేల ఎకరాల్లో వరి సాగైంది. మండల కేంద్రంలో వరి కోతలు ఇప్పటికే మొదలయ్యాయి. వరి కోతలు కోయడానికి రైతులు యంత్రాలను సైతం సిద్ధం చేసుకున్నారు. మబ్బులు అలుముకున్న ఈ సమయంలో కోతలు చేయాలా వద్ద అని రైతులు సందిగ్ధంలో పడ్డారు. వర్షం పడితే పంటకు నష్టం జరుగుతుందని రైతుల ఆందోళన చెందుతున్నారు. కోసిన పంట కల్లంలోకి చేరిన తరువాత వడ్లను ఎండపెట్టడానికి సైతం రైతుకు ఇబ్బంది అవుతుందని ఆలోచిస్తున్నారు. ఇంతలో ఈదురుగాలులు, అకాల వర్షాలు పడితే పంట నేల కొరిగి పూర్తిగా దెబ్బతింటుందని హార్వెస్టర్‌తో కోయడం కష్టంగా ఉంటుందని, కోత కోయడానికి రైతులకు హార్వెస్టర్ ఖర్చు కూడా ఎక్కువ అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కూలీల ఖర్చు పెరుగుతోంది

● దొడ్డ నర్సయ్య, సిర్పూర్ గ్రామం



మూడు రోజులుగా ఉదయం, సాయంత్రం ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటున్నాయి. వర్షం పడుతుందనే ఆందోళనలో ఆకాశం వైపు చూస్తున్నాం. నా వరి పంట కోతలు పూర్తయింది. మబ్బులతో కల్లంలో రోజు వడ్లను ఉదయం ఆరపెడుతున్నా. సాయంత్రం కుప్పవేసి టార్పలిన్ కవర్‌లు కప్పుతున్నాం. దీంతో రైతులకు కూలీల ఖర్చు ఎక్కువ అవుతుంది.

వర్షం కురిస్తే నష్టపోతాం

● ఎన్న గంగాధర్, రైతు దత్తాపూర్



నేను సాగు చేసిన నాలుగు ఎకరాల వరి పంటను కోత కోసి వారం రోజులు అవుతోంది. వడ్లను అమ్మేందుకు కల్లంలో సిద్ధంగా ఉంది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చాయి. ఆకాశంలో అంతా మబ్బులు కమ్ముకున్నాయి. వర్షం కురుస్తుందేమోనని భయంగా ఉంది. అకాల వర్షం కురిస్తే అంతా నష్టపోతాం.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పోరాడుతాం

● ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లు 2025కు వ్యతిరేకంగా పోరాడుతామని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ అన్నారు. మంగళవారం నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ బిల్లు దుష్టమైన చర్య అని ఇది ముస్లింల వ్యక్తిగత చట్టాలు, పవిత్రమైన ఆస్తి హక్కులను తొలగించే ప్రయత్నం అన్నారు. ఈ బిల్లు వక్ఫ్ ఆస్తులపై దాడి మాత్రమే కాదని ముస్లింల గౌరవంపై రాజ్యాంగ ఆత్మపై గాయంగా ఆయన అభివర్ణించారు. ఈ బిల్లులోని ప్రమాదకరమైన నిబంధనలు కేవలం ముస్లింలనే కాదని దేశ ఐక్యతకు కూడా ప్రమాదంలో నెట్టే అవకాశం ఉందని అన్నా టరు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 మత స్వేచ్ఛ హక్కును ప్రభావితం చేస్తుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ బిల్లును ప్రజల ఆస్తులపై కబ్జా చేయడానికి, స్వయం నిర్ణయాధికారాన్ని తొలగించడానికి ఉపయోగిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలతో కలిసి ఈ చట్టానికి వ్యతిరేకంగా పోరాడుతుందని అందుకు ముస్లీం సమాజం ఐక్యంగా ముందుకు రావాలన్నారు.

వీడీసీలపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ)లపై నిషేధం ప్రకటించి చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆగడాలపై నిరసనలో భాగంగా నిజామాబాద్ ఆర్‌డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. గ్రామాలలో వీడీసీల ఆగడాలు రోజురోజుకు పెరుగుతున్నాయని ప్రజాస్వామ్య విరుద్ధంగా సమాంతర పరిపాలన కొనసాగిస్తూ జిల్లాలో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడం కోసం బలహీనవర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా గ్రామాభివృద్ధి కమిటీలపై నిషేధం విధించి వాటిపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు నూర్జహాన్, నగర కార్యదర్శి సుజాత, రాములు, తదితరులు పాల్గొన్నారు.

మండల కార్యాలయాల్లో వినతి..

జిల్లా కమిటీ పిలుపులో భాగంగా సీపీఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో వీడీసీలపై మంగళవారం ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దివెంకట్రాములు, శేఖర్‌గౌడ్, చంద్రకాంత్, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

వివక్ష లేని విద్యావిధానం కోసం పోరాడాలి



మాట్లాడుతున్న టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ సరిత

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వివక్ష లేని విద్యావిధానం కోసం పోరాడాలని అప్పుడే సమాజం ఆరోగ్యకరంగా ఉంటుందని తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సరిత అన్నారు. మంగళవారం నగరంలో నిర్వహించిన జార్జిరెడ్డి 53వ వర్ధంతి సందర్భంగా బహిరంగ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ హాస్టళ్లలో, కళాశాలల్లో మహిళా విద్యార్థుల పట్ల, పేద మధ్యతరగతి విద్యార్థుల పట్ల వివక్షతను, దాడులను కళ్లార చూసిన వ్యక్తి వాటికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు జార్జిరెడ్డి అన్నారు. సాంకేతికంగా నేడు అభివృద్ధి చెందుతూ ముందుకు వెళ్తుంటే ఇంకా మూఢనమ్మకాలు, జ్యోతిష్య శాస్త్రాలను పాఠ్యపుస్తకాల్లో చేర్చేందుకు కొందరు తహతహలాడుతున్నారని విద్యావ్యవస్థను ఇంకా వందేళ్ల వెనక్కి నెట్టేలా ప్రయత్నం చేస్తున్నారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, సాయిబాబా, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గౌతం, జన్నారపు రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం లేబర్ కార్యాలయంలో డిప్యూటీ కమీషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. నందిపేటలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 14 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను అకారణంగా తొలగించారని కొత్తగా వచ్చిన ఏవో, ప్రిన్సిపాల్ కార్మికులపై కక్షకట్టి తొలగించారని వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూదేవి, హనుమాన్‌దాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉషూ క్రీడాకారుడిని అభినందించిన సీపీ

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఇటీవల జరిగిన ఉషూ క్రీడల్లో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించిన జిల్లాకు చెందిన ఎండీ తజ్మూల్ షైమద్‌ను సీపీ సాయిచైతన్య మంగళవారం అభినందించారు. ఏఆర్‌ఎస్సై యాసిర్ షైమద్ కుమారుడైన తజ్మూల్ జాతీయ స్థాయి పోటీలలో బ్రౌంజ్ మెడల్‌ను గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా సీపీ సాయిచైతన్య ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. జాతీయ స్థాయిలో రాష్ట్రం పేరును నిలబెటడం సంతోషకరమని భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, ఏఆర్ ఎస్సై యాసిర్ షైమద్‌లు ఉన్నారు.

నూతన పాలక మండలికి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రసిద్ధ వెంకటేశ్వరస్వామి క్షేత్రంగా విరాజిల్లుతున్న జెండా బాలాజీ మందిర్ నూతన పాలక మండలి ఏర్పాటుకు ధర్మకర్తల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమీషనర్ విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్న వారు దరఖాస్తును పూర్తి చేసి ఈనెల 22 లోపు జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు అందించాలని సూచించారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకొని దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని జెండా బాలాజీ మందిర్ ఆలయ అభివృద్ధికి ధర్మకర్తగా సేవలు అందించే అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టౌన్-1, టౌన్-2 ఏడిఈలు చంద్రశేఖర్, ప్రసాద్‌రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. నగరంలోని పూలాంగ్ చౌరస్తా, వంశీ ఇంటర్నేషనల్, కాకతీయ కాలేజ్, నిఖిల్‌సాయి, రైతుబజార్, దుబ్బ స్టేషన్ పరిధిలో ఏబిసి కాలనీ, సంజీవయ్య కాలనీ, ఆదర్శనగర్, దుబ్బ ఎక్స్‌రోడ్, హమాల్‌వాడి, నాందేవ్‌వాడ, నిజాంకాలనీ, లలితమహల్‌రోడ్, న్యూగంజ్, అర్సపల్లి రోడ్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజలు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలి

● పోలీస్ కమిషనర్ సాయి చైతన్య



నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు ఈ దిగువ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా విగ్రహాలను ప్రతిష్టించరాదని ముఖ్యంగా జనం రద్దీగా ఉండే ప్రాంతాలు, పార్కులు, ఐలాండ్, ప్రభుత్వ భవనాలు వంటి చోట్ల ఎటువంటి విగ్రహాలను ఏర్పాటు చేయవద్దన్నారు. విగ్రహాల ఏర్పాటుకు కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. ఎక్కువ శబ్దంతో డీజేలను ఏర్పాటు చేయరాదని ఇలా చేయడం వల్ల దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడే వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు ఇబ్బందులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. రెసిడెన్షియల్, కమర్షియల్ స్థలాల్లో రాత్రి సమయంలో 55 డేసీగర్స్ సౌండ్ వాడాలని రాత్రి 10 నుంచి ఉదయం 6గంటల వరకు డీజేల సౌండ్ సిస్టమ్ పూర్తిగా నిషేధం అని, డీజేలకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ఊరేగింపసులు, బహిరంగ సభలకు పరిమితులకు మించిన ధ్వని ఉత్పత్తి చేసే డీజేలు, సౌండ్ సిస్టమ్‌లు కమిషనరేట్ పరిధిలో నిషేధం ఉందన్నారు. ఎవరైనా సభలు, సమావేశాలు, జనసంచార ప్రాంతాల్లో లౌడ్ స్పీకర్లు పెట్టాలని భావిస్తే సంబంధిత అధికారుల నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాలని, 500 మందితో కూడిన సమావేశాలు, సభలు నిర్వహిస్తే సంబంధిత ఏసీపీ నుంచి తప్పనిసరిగా 72 గంటల ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. మాల్స్, సినిమా థియేటర్స్, హోటల్స్, ఎగ్జిబిషన్, బిజినెస్ ప్రదేశాల వద్ద ప్రజల కోసం తప్పనిసరిగా సెక్యూరిటీ నిబంధనలు పాటించాలన్నారు. డ్రోన్‌ల వాడకం వల్ల ఎక్కువ ప్రమాదాలు పొంచిఉన్న నేపథ్యంలో డ్రోన్‌ల వాడకానికి తప్పనిసరిగా ప్రభుత్వ సంస్థలు, పోలీసు, ఏవియేషన్ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. జిల్లాలో నకిలీ గల్ఫ్ ఏజెంట్లు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని గల్ఫ్ ఏజెంట్లు అనధికారికంగా వ్యాపారాలు నిర్వహిస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని కావున గల్ఫ్ ఏజెంట్లకు ప్రజలు ఇళ్లు అద్దెకు ఇచ్చేముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అటువంటి వారు అద్దెకు వస్తే వారి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు. జిల్లాలో ఏ సర్టిఫికెట్ పొందిన సినిమాలను మైనర్లు చూడడానికి థియేటర్లకు అనుమతించరాదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వ్యక్తులు నిజామాబాద్ వీధుల్లో చట్టాన్ని గౌరవించే పౌరుల పట్ల ముఖ్యంగా మహిళలు, పిల్లల పట్ల అసభ్యకరమైన వికృత, అసభ్యకరమైన ప్రవర్తనను ప్రదర్శిస్తున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయని కావున బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేశామన్నారు. పైన తెలియజేసిన నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే వారిపై సంబంధిత చట్టాల ప్రకారం తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ నిబంధనలు ఏప్రిల్ 30 వరకు అమల్లో ఉంటాయని సీపీ తెలిపారు.

కలుషిత నీరు తాగి 44 గొర్రెల మృతి

ధర్పల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కలుషిత నీరు తాగి 44 గొర్రెలు, మేకలు మంగళవారం మృతి చెందాయి. మండలంలోని ఒన్నాజిపేట గ్రామానికి చెందిన గంప పెద్ద రాజయ్య, పెద్దోళ్ల బొత్తయ్యలకు చెందిన గొర్రెలు, మేకలు మేపేందుకు గ్రామ శివారులోకి తీసుకెళ్లారు. అక్కడ ఉన్న నీటిని గొర్రెలు, మేకలు తాగడంతో వెంటనే అక్కడే మృతి చెందాయి. సంఘటన స్థలాన్ని సీఐ భిక్షపతి, తహసీల్దార్ మాలతి, వెటర్నరీ అధికారులు సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసు కేసు నమోదు చేశారు. గొర్రెలు ఎలా చనిపోయాయో అన్నది పోస్టుమార్టం నివేదిక అనంతరం తెలుస్తుందని అన్నారు. దాదాపు 5లక్షల మేర నష్టం వాటిల్లిందని తెలిపారు. కుటుంబాలు బోరున విలపించాయి. తమను ఆదుకోవాలని అధికారులను కోరారు.



మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న తహసీల్దార్ మాలతి

అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం



కమ్మర్‌పల్లిలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కమ్మర్‌పల్లి, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం క్షీరాభిషేకం చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో అంబేద్కర్‌ను అవమానపరచిన బీజేపీ, ఆయన జయంతిరోజు విగ్రహాలశుద్ధి పేర అంబేద్కర్ విగ్రహాలను తాకి అపవిత్రం చేశారని ఆరోపిస్తూ క్షీరాభిషేకం చేసినట్లు మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంకెటరవి,మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పాలెపు నర్సయ్య, ఉపాధ్యక్షుడు సుంకెటబుచ్చన్న, ప్రసాద్,జిల్లా నాయకుడు తక్కూరి దేవేందర్, మండల నాయకులు బుచ్చి మల్లయ్య, సింగిరెడ్డి శేఖర్, అజ్మత్ హుసేన్, అజారోద్దీన్, సుంకెట శ్రీనివాస్, జగదీశ్, శేఖర్, నాగరాజు నాయకులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: తెలంగాణ రాష్ట్ర ప్రజలపై బీజేపీ కపట ప్రేమ చూపిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు స్వామి అన్నారు. మంగళవారం పట్టణంలో పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. బీఆర్ అంబేద్కర్‌ను హోంమంత్రి అమిత్‌షా అవమానించారని అలాంటి వారికి విగ్రహం ముట్టుకునే అర్హత లేదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జెజెనర్సయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జీవన్, దొన్కంటి కిషన్, మూడెడ్ల అశోక్, శివప్రసాద్,సురేష్,రాజు, సతీష్, మనోజ్, మిరాజ్ పాల్గొన్నారు.

మెండోర:మండల కేంద్రంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి, నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక పక్క పార్లమెంట్‌లో బాబాసాహెబ్ అంబేద్కర్‌ని అవమానిస్తూ మరోపక్క అంబేద్కర్ విగ్రహ శుద్ధి పేరుతో బీజేపీ నాయకులు అంబేద్కర్ విగ్రహాలను తాకినందుకు నిరసనగా అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి శుద్ధి చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండోజి రవి, పటేల్ నవీన్, గణేష్, సాయరెడ్డి, రుషి, కపిల్, శ్రీధర్, గణపతి పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల జీతాలు ఇప్పించండి

● ఎమ్మెల్యేకు వినతిపత్రం

ఇందల్వాయి,ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి):ఎర్రటి ఎండలో పని చేస్తున్న ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ల మూడు నెలల జీతాలను తక్షణమే ఇప్పించాలని కోరుతూ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డికి ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడు రవి ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కుకునూర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వేల్పూర్,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):వేల్పూర్ మండలం కుకునూర్ గ్రామంలో పడిగెల సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతు పక్షపాతి అని, రైతులకు ఎక్కడ కూడా ఇబ్బంది కలగవద్దన్న ఉద్దేశ్యంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. వేల్పూర్ మార్కెట్ కమిటి పరిధిలో గతంలో 35 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే ప్రస్తుతం 50 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మహిళ సంఘాలు, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఈ కొనుగోలు కేంద్రాలు నిర్వహించడం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ నవీన్, కార్యదర్శి మోహన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి భూమారెడ్డి, నాయకులు రవి, రమణ, మధు, గ్రామాభివృద్ధి సభ్యులు పాల్గొన్నారు.

సారంగాపూర్ హనుమాన్ ఆలయ హుండీ లెక్కింపు

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని సారంగపూర్ హనుమాన్ ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. హనుమాన్ జయంతితో పాటు నెలరోజులకు గాను హుండీ ఆదాయం రూ.60వేల 476లు ఆదాయం సమకూరినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకురాలు కమల తెలిపారు. ఇందులో రూ.53,520 నోట్ల రూపంలో, రూ.6,956లు నాణెల రూపంలో ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ పెద్దరాంమందిర్, హనుమాన్‌మందిర్ ఫిట్‌పర్సన్ రాములు, అర్చకులు శశికుమార్ రాందాసి, జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్‌కుమార్, విష్ణుసహస్రనామ పారాయణ భక్తులు పాల్గొన్నారు.

పీజీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

డిచ్‌పల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ 5ఏళ్ల ఇంటి గ్రేటెడ్ ఏపీఈ, ఐఎంబీఏ, ఐపీసీహెచ్, కోర్సుల 1,3వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు టీయూ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరిలు మంగళవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీవోఈ సంపత్ కుమార్, అడిషనల్ కంట్రోలర్ సంపత్, ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్, పీఆర్వో పున్నయ్య పాల్గొన్నారు.

కొలిప్యాక్‌లో చెక్కుల పంపిణీ

జక్రాన్‌పల్లి,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో మంగళవారం పలువురికి మం జూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మద్దుల రమేష్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాం గ్రెస్ పార్టీ నాయకులు సాగర్, రవిగౌడ్, శంకర్, ప్రేమ్‌కుమార్, సాయ గౌడ్, మోహన్, నారాయణ, తిరుపతి, దినేష్, పాల్గొన్నారు.

కోటగిరి సొసైటీలో కొనసాగుతున్న విచారణ

కోటగిరి,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): కోటగిరి సహకార సంఘంలో బోనస్ అవినీతి అక్రమాలపై విచారణ ప్రారంభమైంది. మంగళవారం సహకార శాఖ అధికారులు అంబర్ సింగ్ రాథోడ్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది. సంఘంలో ఏడుగురు వ్యక్తులపై బోనస్ కాజేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, కూచి అనిత, ఎండీ ఇస్మాయిల్, శ్రీకాంత్,అశ్వక్, గాండ్ల శ్రీనివాస్‌తో పాటు పలువురికి నోటీసులు జారీ చేశామని విచారణ అధికారి అంబర్ సింగ్ రాథోడ్ తెలిపారు. సహకార సంఘంలో ఒక్కొక్కరిని విచారించి సమగ్ర నివేదిక రూపొందిస్తామని విచారణ అధికారి తెలిపారు.బోనస్ ఏవిధంగా తీసుకున్నారో ఏఏ రైతుల నుంచి పట్టాపాస్ పుస్తకాలు సేకరించారో సంబంధిత రైతులకు నోటీసులు జారీ చేస్తామన్నారు.సమగ్ర విచారణ జరిపి జిల్లాకలెక్టర్‌కు నివేదిక అందిస్తామని ఆయన తెలిపారు.ఈకార్యక్రమంలో విచారణ అధికారులు, సీనియర్ ఇన్స్‌స్పెక్టర్, జూనియన్ ఇన్స్‌స్పెక్టర్‌లు ఉన్నారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలి

సిరికొండ ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వ్యక్తిని విధుల్లో నుంచి తొలగించాలి కోరుతూ ఏఐకెఎంఎస్ మండల అధ్యక్షుడు నిమ్మల భూమేష్ ఎంపీడీవోను కోరారు. గడ్కోల్ గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వ్యక్తి కూలీలకు డబ్బులు ఇప్పించకుండి అవకతవకలకు పాల్పడిను తొలగించాలని కోరుతూ ఏఐకెఎంఎస్ మండల నాయకులు కూలీలతో కలిసి ఎంపీడీవో మనోహర్‌రెడ్డికి మంగళవారం వినత్రి పత్రాన్ని అందజేశారు. గత ఏడాది గడ్కోల్ గ్రామంలో ఉపాధిహామీ పథకంలో కూలీలకు డబ్బులు రాకుండ అనేక అవకతవకలకు పాల్పడ్డాడని వారు ఎంపీడీవోకు వివరించారు.అవక తవకలకు పాల్పడినవ్యక్తిని సస్పెండ్ చేసినఅధికారులు తిరిగివిధుల్లోకి తీసుకోవడ మేమిటని ప్రశ్నించారు.అతనిపై తిరిగి విచారణ చేసి విధుల్లో నుంచి తొలగించాలని భూమేష్ కోరారు.

కిశోర బాలికలకు రక్త పరీక్షలు

సిరికొండ ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): సిరికొండ మండల కేంద్రంలో గల అంగన్ వాడి పాఠశాలలో 11 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపు కిశోర బాలికలకు వైద్యా ఆరోగ్య శాఖ సిబ్బంది మంగళవారం రక్త పరీక్షలు చేశారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా సిరికొండ మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బాలికలకు వైద్యా ఆరోగ్యశాఖ సిబ్బంది రక్త నమూనాలు సేకరించారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ సపర్‌వైజర్లు నాగలక్ష్మి,సవిత, ఆరోగ్యశాఖ పర్యవేక్షకులు మెండోదరి, ఏఎన్ఎం,ఫార్మసిస్ట్,అంగన్‌వాడి టీచర్లు పద్మా,రాధాకృష పాల్గొన్నారు.

సన్నబియ్యం సరే.. దొడ్డు బియ్యం సంగతేంటి?

(ఐదో పేజీ తరువాయి)

ఇందులో ఆహార భద్రత, అంత్యోదయ, అన్నపూర్ణ కార్డులు కలిగిన కుటుంబాలు 4లక్షల 2వేల 154 ఉండగా, 13లక్షల 10వేల 12 మందికి ప్రతీనెలా బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో 3లక్షల 80వేల 222 కుటుంబాలకు ఆహార భద్రత కార్డులు ఉండగా 12లక్షల 50వేల 996 మందికి ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున 7505.856 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అంత్యోదయ కార్డులు 20వేల 916 ఉండగా వాటి పరిధిలో 57వేల 997 మందికి 732.060 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. అన్నపూర్ణ కార్డుదారులు 1016 ఉండగా 1039 మందికి 10వేల 160 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రతీనెల పంపిణీ చేస్తున్నారు.

దొడ్డు బియ్యం నిల్వలు వెయ్యి క్వింటాళ్ల పైనే...

జిల్లాలో ప్రతినెలా రేషన్ దుకాణాల ద్వారా 8,248 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ జరుగుతుండగా గత నెలలో 80 శాతానికి పైగా రేషన్ బియ్యం పంపిణీ జరిగినట్లు తెలుస్తోంది. గత నెలలో రేషన్ షాపులకు కోటా కేటాయింపు, బియ్యం తరలింపు ఆలస్యం కావడంతో స్టాక్ పాయింట్లలో దొడ్డు బియ్యం నిల్వలు పేరుకుపోయాయి. అలాగే రేషన్ షాపులలో పంపిణీ కాకుండా దొడ్డు బియ్యం నిల్వలు ఉండిపోయాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు వెయ్యి క్వింటాళ్లకు పైనే దొడ్డు బియ్యం నిల్వలు రేషన్ షాపులలో ఉన్నాయి. అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం వెయ్యి క్వింటాళ్లే అయినప్పటికీ సుమారు 1500 క్వింటాళ్ల వరకు దొడ్డు బియ్యం నిల్వలు రేషన్ షాపుల్లో ఉన్నట్లు సమాచారం. ప్రతీ రేషన్ దుకాణానికి వారి కోటా ప్రకారం బియ్యాన్ని కేటాయిస్తారు. గత నెలకు సంబంధించిన దొడ్డు బియ్యం నిల్వలు అలాగే రేషన్ షాపులలో ఉండగా ఈనెలకు సంబంధించిన కోటా సన్నబియ్యం అధికారులు కేటాయించడంతో రేషన్ దుకాణాల్లో సరైన స్థలం లేక సన్నబియ్యం ఎక్కడ పెట్టాలో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో రేషన్ డీలర్లు ఇబ్బందులు పడుతున్నారు. చిన్న గదులలో రేషన్ దుకాణాలను నిర్వహిస్తున్న రేషన్ డీలర్లు అక్కడే బియ్యాన్ని స్టాక్ చేయాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు ఎప్పుడు వచ్చి తనిఖీలు చేస్తారో అప్పుడు ఉన్న స్టాక్‌ను చూపించాల్సిన పరిస్థితి ఉంటుంది. కానీ దొడ్డు బియ్యం నిల్వలు అలాగే ఉండగా సన్నబియ్యాన్ని ఎక్కడ ఉంచాలో తెలియక రేషన్ డీలర్లు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పౌరసరఫరాల అధికారులు మాత్రం ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు లేవని చెబుతుండటంతో రేషన్ డీలర్ల పరిస్థితి ముందు నుయ్యి వెనక గొయ్యి లాగా మారింది.

బోధన్ గోశాలకు పశుగ్రాసం పంపిణీ

కోటగిరి,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):పొతంగల్ గ్రామానికి చెందిన శ్రీ రాజరాజేశ్వర ఫర్టిలైజర్ వ్యాపారి బండారి హన్మాండ్లు బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వర గోశాలకు పశుగ్రాసం మంగళవారం అందజేశారు. బోధన్ ఏకచక్రేశ్వర గోశాలకు తనవంతు సాయంగా వంద గడ్డి కట్టలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్ పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా అమలు కోసం ఆందోళన

సిరికొండ ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా అమలు కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారం టీల్లో ఆత్మీయ భరోసా మాత్రం ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంద న్నారు.ప్రభుత్వం ఆత్మీయ భరోసా అమలు చేయక పోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని ఆయన తెలిపారు.

రైతులకు టార్పాలిన్ కాగితాల పంపిణీ

సిరికొండ ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అర్వింద్ సహాయ సహకారంతో అతి తక్కువ ధరకు టార్పాలిన్(తాటిపత్రి) కాగితాలను రైతులకు అందజేయడం జరుగుతుందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ధర్పల్లి బాబురావు తెలిపారు. సిరికొండ మండల కేంద్రానికి చెందిన రైతులకు ధాన్యం వర్షాలకు తడువకుండా ఉండడానికి నాణ్యమైన జీఎస్ఎం 250 రకం తాటిపత్రా (టార్పాలిన్ కాగితాలు)లను సబ్సిడీ ధరకు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి సహాయ సహకారంతో అందజేశారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మధు,మారుతి, కిరన్,సూర్‌నీడ గోపి తదితరులు ఉన్నారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Bodhan branch, agreed to accord loan to Borrower : Mohammed Abdul Rasheed S/o Abdul Sattar Age 38 Years, Occ: Business, R/o H.No. 14-357, Sharbati canal Bodhan Town & Mandal, Nizamabad Dist, Property holder: Abdul Sattar S/o Ismail Aged 87 Years, Occ: Business R/o H.No. 14-357 Sharbati canal, Bodhan Town & Mandal Nizamabad Dist, by mortgage of the schedule property mentioned below. The above prospective loanee agreed to create first charge against property mentioned below in favour of my client company. If any person having any title, claim, or objection of what so ever nature may put forth their claims before me within 7 days of this notice. The objection raised afterwards shall be deemed to be "Waived" and not binding on my client company and my client shall proceed further for according above loan

Schedule

The Commercial Shutter Place Bearing .H.No 1-4-1186 [Old] New H.No 1-4-1439 Total Area of admeasuring 24.44 Sq yards Situated At Goshala Road Bodhan Town & mandal Nizamabad Dist. Under the Jurisdiction of Registration Dist Nizamabad Sub Dist Bodhan

Bounded as under.

East: 50'-0" Feet Road , **West:** Open Place Ravinder Reddy & Rajender Reddy, **North:** Open Place Ravinder Reddy & Rajender Reddy, **South:** Shop of Shaik Moinuddin

K. SUBBA RAO, B.sc. LLB
Advocate, Bodhan, Ph:9440004201

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd. Bodhan branch, agreed to accord loan to Borrower : Bodhu Karthik S/o Lingaiah Age 29 Years, Occ- Business R/o H.No. 4-2-232/2 Bodhan Town & Mandal Nizamabad Dist, Property holder: Bodhu Karthik S/o Lingaiah Age 29 Years Occ : Business R/o H.No.4-2-232/2 Bodhan Town & Mandal, Nizamabad Dist, by mortgage of the schedule property mentioned below. The above prospective loanee agreed to create first charge against property mentioned below in favour of my client company. If any person having any title, claim, or objection of what so ever nature may put forth their claims before me within 7 days of this notice. The objection raised afterwards shall be deemed to be "Waived" and not binding on my client company and my client shall proceed further for according above loan.

Schedule

The House Bearing G P H.No. 4-2-232/2 Total Area of admeasuring 93.50 Sq yards And R.C.C. Plith Area Ground Floor 770 Sq Feets or 1st Floor R.C.C. Plith Area 672 Sq Feets Situated At Hanuman Temple Bodhan Town & Mandal Nizamabad Dist. Under the Jurisdiction of Registration Dist Nizamabad Sub Dist Bodhan

Bounded as under.

East: 20' : Feet Road , **West:** House Of Sri Murali, **North:** House Of Sri Shaik Nabi, **South:** 80' : Feet Wide Road

K. SUBBA RAO, B.sc. LLB
Advocate, Bodhan, Ph:9440004201

